క్లుప్తంగా

ప్రజల మనిషి 'ఆరికట్ల'



ఆరికట్ల విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అశోక్‌బాబు

కొండపి(సింగరాయకొండ): కొండపి మండల ప్రజల మనసులో ఆరికట్ల వెంకటేశ్వర్లుకు ప్రత్యేక స్థానం ఉందని, ఆయన లేని లోటు తీరనిదని వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. కొండపిలో గురువారం జరిగిన ఆరికట్ల వెంకటేశ్వర్లు ద్వితీయ వర్ధంతి కార్యక్రమంలో వరికూటి పాల్గొన్నారు. ఈ సందర్భంగా బస్టాండ్ సెంటర్‌లోని ఆరికట్ల వెంకటేశ్వర్లు విగ్రహానికి వరికూటి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వరికూటి ఆరికట్ల కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆరికట్ల కోటిలింగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి పోకూరి కోటయ్య, మండల జెసిఎస్ కన్వీనర్ గొట్టిపాటి మురళి, ఆరికట్ల హరిబాబు, దివి శ్రీనివాసులు, పిచ్చయ్య చౌదరి, బచ్చల కోటు, మండల మహిళా అధ్యక్షురాలు మేడిద ఈశ్వరమ్మ, పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందచేస్తున్న చైర్మన్ గఫార్, క్లబ్ సభ్యులు

కనిగిరి రూరల్: కాస్మోపాలిటన్ క్లబ్‌లో పని చేస్తు అనారోగ్యంతో మృతి చెందిన జి.గురవయ్య కుటుంబానికి రూ.50వేలు నగదు ఆర్థిక సాయం గురువారం క్లబ్ కమిటీ అందచేశారు. ఈ సందర్భంగా కాస్మోపాలిటన్ క్లబ్ అధ్యక్షుడు, మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ పేద కుటుంబాలకు తమ వంతు సాయం ఎల్లప్పుడు అందచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి సిరుప వెంకట గోవర్ధన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ముత్యాల శ్రీనివాసులరెడ్డి, కోశాధికారి అల్లూరి సత్యన్నారాయణ, సభ్యులు సుబ్బారెడ్డి, ఎం నరసింహారావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

40 వాహనాలకు జరిమానా



స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని తనిఖీ చేస్తున్న ఎంవీఐ రవికుమార్

పామూరు: నిబంధనలను అతిక్రమించి అధిక వేగంతో వెళ్తున్న 40 వాహనదారులకు రూ.40 వేల జరిమానా విధించినట్లు దర్శి ఎంవీఐ పరిశపోగు రవికుమార్ తెలిపారు. 565 జాతీయ రహదారిపై బుధ, గురువారాల్లో స్పీడ్‌గన్‌తో వాహనాల వేగాన్ని తనిఖీచేసి అతివేగంగా వెళ్తున్న వాహనదారులకు జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, మితిమీరిన వేగం వల్లే తరుచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. రోడ్డు నిబంధనలను పాటిస్తూ, లైసెన్స్ కలిగిఉండి వాహనాలను నడిపి సురక్షిత ప్రయాణాలు సాగించాలన్నారు.

52 మందికి వైద్య పరీక్షలు

హనుమంతునిపాడు: మండల పరిధి దొడ్డిచింతలలో గురువారం ఇంటింటికి ఫ్యామిలీ వైద్య సేవల్లో భాగంగా 52 మందికి డాక్టర్ ప్రతాపురెడ్డి వైద్య పరీక్షలు చేశారు. తరువాత దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న కొంత మందికి ఇంటింటికి తిరిగి వైద్య పరీక్షలు చేశారు. మందులు అందచేశారు.

ఎమ్మార్పీఎస్ కార్యకర్తల రాస్తారోకో

ఉలవపాడు: ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ చేయాలని ఎమ్మార్పీఎస్ పిలుపు మేరకు మన్నేటికోట రోడ్డు వద్ద 16వ నంబర్ జాతీయరహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వర్గీకరణకు అనుకూలమని చెప్పిన బీజేపీ వెంటనే వర్గీకరణ చేయాలని వారు డిమాండ్ చేశారు. మాదిగలకు ఇచ్చిన మాటపై బీజేపీ ప్రభుత్వం ఉంటుందో లేదో తేల్చుకోవాలని తెలిపారు. నియోజకవర్గ ఇన్‌చార్జి రావినూతల ముత్తుమాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా కో కన్వీనర్ కిట్టు మాదిగ, ఆశీర్వాదం, జాషువా, వెంకటేశ్వర్లు, సురేంద్ర, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

జీవిత బీమా కల్పించడం శుభపరిణామం

ఉలవపాడు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సచివాలయ కన్వీనర్లు, గృహ సారధులకు పార్టీ ఆధ్వర్యంలో జీవిత బీమా కల్పించడం శుభపరిణామం అని మండల జేసీఎస్ కన్వీనర్ ధన కోటేశ్వరరావు అన్నారు. మండల పరిధిలోని చాకిచర్లలో ఏర్పాటుచేసిన ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పార్టీని బలోపేతం చేసే దిశగా వారి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశ్యంతో ఇన్సూరెన్స్ నమోదు కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

పేదలందరికీ ఇళ్ల పట్టాలు

- వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు



తహసీల్దార్ ఉషతో పేదల ఇళ్ల పట్టాల విషయమై చర్చిస్తున్న అశోక్‌బాబు

సింగరాయకొండ: సెంటు భూమి కూడా లేని నిరుపేదలకు ఇళ్ల పట్టాలు అందించడమే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు పేర్కొన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో గురువారం పేదల ఇళ్ల పట్టాల విషయమై తహసీల్దార్ సీహెచ్ ఉషతో వరికూటి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలో ఎంతోమంది స్థలాలు ఆక్రమించుకుని దర్జాగా జీవిస్తున్నారని, వారిపై చర్యలు తీసుకోకపోగా పేదలు సెంటు భూమి అడిగితే సవాలక్ష ప్రశ్నలతో ఇబ్బంది పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా మండలంలో ప్రతి గడప తిరిగానని సుమారు 250 మంది వరకు తమకు అర్హత ఉన్నా ఇంటి పట్టా రాలేదని తన దృష్టికి తీసుకొచ్చారని వివరించారు. ఇటీవల మండల కాంప్లెక్స్ సమీపంలోని రాములమ్మ కాలనీకి వెళ్లగా 20 మంది పేదలు వచ్చి ఇంటి పట్టా మంజూరు చేయాలని వేడుకున్నారని, దీనిపై విచారణ చేపట్టి ఇంటి పట్టాలు మంజూరు చేయాలని తహసీల్దార్ ఉషకు విజ్ఞప్తి చేశారు. అవసరమైతే ఆక్రమణదారుల నుంచి స్థలాలు స్వాధీనం చేసుకుని పేదలకు ఇవ్వాలని సూచించారు. దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ.. మండలంలో సుమారు 1,900 ఎకరాల భూమి ఆక్రమణదారుల చెరలో ఉందన్నారు. ఆయా భూములకు సంబంధించి వారి వద్ద ఎటువంటి హక్కు పత్రాలు లేవన్నారు. ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చి స్థలాలు స్వాధీనం చేసుకుంటామని చెప్పారు.

ఆటోనగర్‌కు స్థలం చూపాలి

మండల కేంద్రంలో సుమారు 30 ఏళ్ల క్రితం ప్రభుత్వం ఆటోనగర్ ఏర్పాటుకు స్థలం కేటాయించిందని కానీ ఇంతవరకు సెంటు కూడా ఇవ్వలేదన్నారు. గత టీడీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నాయకులు ఎమ్మెల్యే స్వామి అండతో ఆటోనగర్ స్థలంలో కుంట తవ్వి మట్టి అమ్ముకుని లక్షలాది రూపాయలు ఆర్జించారని తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆటోమొబైల్ రంగంపై ఆధారపడి జీవించే వారు దుకాణాలు ఏర్పాటు చేసుకునేందుకు స్థలం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

దీనిపై తహసీల్దార్ మాట్లాడుతూ.. పెరల్ డిస్టిలరీ సమీపంలో ప్రభుత్వ భూమి సుమారు 13 ఎకరాలు ఉందని ఆ స్థలాన్ని ఆటోనగర్‌కు కేటాయిస్తామని వెల్లడించారు. అతి త్వరలో అన్ని అనుమతులు తీసుకుని స్థలాన్ని పంపిణీ చేస్తామని పేర్కొనడంతో తహసీల్దార్‌కు వరికూటి ధన్యవాదాలు తెలిపారు. సర్వేయర్ డి.బ్రహ్మం, వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ తన్నీరు సుబ్బారావు, యన్నాబత్తిన కార్తీక్, షేక్ పటేల్, ముళ్లపూడి సత్యన్నారాయణ, శ్రీహరి రెడ్డి, షేక్ సలీంబాషా, గొరవపు నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

క్రీడలతో ఐకమత్యం పెంపు



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, సర్పంచ్ పోతు రమణారెడ్డి



ఉత్సాహంగా సాగుతున్న క్రీడా పోటీలు

- ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలు

కనిగిరి రూరల్: క్రీడలు విద్యార్థుల్లో ఏకాగ్రత, ఐక్యతను పెంపొందిస్తాయని జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలను గురువారం జెడ్పీటీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యయుడు సి. విజయ భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో తోడ్పాటునిస్తున్నట్లు చెప్పారు. క్రీడల్లో రాణించి పాఠశాలకు, గ్రామానికి, తల్లిదండ్రులకు మంచి పేరుతేవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ పోతు వెంకట రమణారెడ్డి, ఎంఈఓలు దేవిరెడ్డి రామిరెడ్డి, ఉడుముల నారాయణరెడ్డి, రాచగుండ్ల శ్రీనివాసులు, విద్యాకమిటీ చైర్మన్ మితికల శివన్నారాయణ, సర్పంచులు పాల్గొన్నారు. గురువారం నుంచి మూడు రోజుల పాటు జరిగే స్కూల్ గేమ్స్ పోటీలు ఉత్సాహ భరితవాతావరణంలో ప్రారంభమయ్యాయి. అండర్ 14, అండర్ 17 గేమ్స్‌లో మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు సుమారు 450 మంది నియోజకవర్గ స్థాయి పోటీల ఎంపికలో పాల్గొన్నారు. ఆరు మండలాల నుంచి క్రీడా విద్యార్థులు పాల్గొన్నారు. గురువారం వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్ బ్యాట్మంటన్, టెన్నికాయిట్, యోగా, త్రోబాల్, అథ్లెటిక్స్ పోటీలు జరిగాయి. 22న శుక్రవారం ఖోఖో, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, 23న శనివారం అథ్లెటిక్స్ పోటీలు జరుగుతాయని నియోజకవర్గ కో ఆర్డినేటర్ బి.కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. పీడీలు, పీఈటీ, హజరత్‌రెడ్డి, శ్రీనివాసుల రెడ్డి, బసవయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా గణేశ్ నిమజ్జనం



వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు హరిబాబు ఆధ్వర్యంలో గణేశ్ నిమజ్జనం



స్వామివారి లడ్డును వేలంలో దక్కించుకున్న మారెడ్డి వెంకటేశ్వరరెడ్డి

సింగరాయకొండ: గత నాలుగు రోజులుగా విశేష పూజలందుకున్న గణనాథుడి విగ్రహాలను గురువారం నిమజ్జనానికి తరలించారు. సింగరాయకొండ మండలంలోని పాకల బీచ్‌లో గురువారం వినాయక నిమజ్జనాలు ఉత్సాహంగా సాగాయి. మండలంని పలు గ్రామాలతోపాటు చుట్టుప్రక్కల మండలాల నుంచి విగ్రహాలు పెద్ద సంఖ్యలో పాకల తీరానికి చేరుకోవడంతో కోలాహలం నెలకొంది. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార కమిటీ అధ్యక్షుడు చింతపల్లి హరిబాబు ఆధ్వర్యంలో జమ్ములపాలెం వినాయక విగ్రహాన్ని పాకల తీరంలో నిమజ్జనం చేశారు. విగ్రహాల వెంట వచ్చిన భక్తులు సముద్ర స్నానాలు ఆచరించారు. తీరంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు. భద్రతా చర్యల్లో భాగంగా పాకల తీరంలో గణేశ్ నిమజ్జనాలకు సాయంత్రం ఆరు గంటల వరకే అనుమతించినట్లు సీఐ దాచేపల్లి రంగనాథ్ తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి విగ్రహాలను సాయంత్రంలోపే తీసుకురావాలని సూచించారు.

మద్దిపాడు: మండల కేంద్రమైన మద్దిపాడిలోని పడమటిబజారు, తూర్పుబజారులో ఏర్పాటు చేసిన లంబోదరుడి విగ్రహాలను గురువారం భక్తుల సందడి నడుమ నిమజ్జనానికి తరలించారు. రామాలయ ఆవరణలో లడ్డూ వేలం నిర్వహించగా గ్రామానికి చెందిన మారెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి దంపతులు రూ.38 వేలకు దక్కించుకున్నారు. స్వామివారి కలశాన్ని ఇనుకొల్లు కృష్ణారెడ్డి దంపతులు దక్కించుకున్నారు.

సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి

హనుమంతునిపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే జాగ్రత్తగా నిర్వహించాలి డాక్టర్ ప్రతాపురెడ్డి, డాక్టర్ సందీప్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష ఇంటింటి సర్వే ముప్పాళ్లపాడులో గురువారం నిర్వహించారు. సర్వేను వైద్యాధికారి పర్యవేక్షించారు. అనంతరం సాయంత్రం పీహెచ్‌లో నిర్వహించి క్లస్టర్ సమావేశంలో వైద్యులు పాల్గొని మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య క్యాంపులు వచ్చే నెల 3వ తేదీ నుంచి జరుగుతాయన్నారు. ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు ఇంటింటికి సందర్శించాలన్నారు. ఇంటింటి సర్వేలో గుర్తించిన వారికి కార్పొరేట్ స్థాయి వైద్యులతో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఆపరేషన్లు అవసరమైన వారికి కార్పొరేట్ ఆస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. డాక్టర్ సందీప్, సీహెచ్‌ఓకేవీ చెన్నయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

2 నుంచి సీపీఎం పాదయాత్ర

ఉలవపాడు: నెల్లూరు జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం అక్టోబర్ 2 నుంచి సీపీఎం పాదయాత్ర చేస్తున్నట్లు సీపీఎం కందుకూరు నియోజకవర్గ నాయకుడు జి. వెంకటేశ్వర్లు అన్నారు. ఉలవపాడులో జరిగిన మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. రామాయపట్నం పోర్టు నుంచి పాదయాత్ర ప్రారంభమై అక్టోబర్ 11కు నెల్లూరుకు చేరుకుని 13న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఉలవపాడులో బస్‌స్టేషన్ ఉపయోగంలోకి తెచ్చి సర్వీసు బస్సులను నిలుపుదల చేయాలన్నారు. మండల కార్యదర్శి జీవీబీ కుమార్, మండల నాయకులు వెంకటేశ్వర్లు, మాచర్ల రావు తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు ప్రభుత్వం బాసట



పాడి రైతులతో మాట్లాడుతున్న రాజశేఖర్

జరుగుమల్లి: పాడి రైతుల అభ్యున్నతికి ప్రభుత్వం కోఆపరేటివ్ బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేస్తూ బాసటగా నిలుస్తోందని డీసీఓ పి.రాజశేఖర్ పేర్కొన్నారు. గురువారం పచ్చవ గ్రామంలో నేషనల్ లైవ్ స్టాక్ మిషన్ లోన్ మేళా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీసీఓ మాట్లాడుతూ.. పాడి రైతులు అదనంగా గేదెల కొనుగోలు చేసేందుకు రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ జలజాక్షి మాట్లాడుతూ.. పాల వ్యాపారం వల్ల అదనపు ఆదాయం చేకూరుతుందన్నారు. మహిళా రైతులు రుణాలు పొంది ఆర్థికంగా నిలదొక్కుకోవాలని ఆకాంక్షించారు. పశువులకు అందిస్తున్న వైద్య సేవలను జరుగుమల్లి పశువైద్యాధికారి అరుణ వివరించారు. పాలలో ఎస్ఎన్ఎఫ్, ఫ్యాట్ పెరుగుదల కోసం గేదెలకు అందించాల్సిన ఆహారం గురించి తెలియజేశారు. ఏపీఎం భాగ్యలక్ష్మి, పీడీసీసీ టంగుటూరు, కొండపి బ్యాంకు మేనేజర్లు జి.మధుసూధన్, జీవీఆర్ ప్రసాద్, రూట్ ఆఫీసర్ వెంకట్రావు మహిళలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న సూపర్‌వైజర్ పార్వతి

కనిగిరి రూరల్: గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలనే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారాన్ని అందచేస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎంవీఎస్ పార్వతి అన్నారు. మండలంలోని కంచర్లవారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పౌష్టికాహార వారోత్సవాలపై తల్లి దండ్రులకు, గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ పార్వతి మాట్లాడుతూ వైఎస్సార్ సంపూర్ణ ఆరోగ్య కిట్స్ ద్వార అనేక రకాల పోషకాహారాలను అందచేస్తున్నట్లు చెప్పారు. చిన్నారులను విధిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని కోరారు.

పొగనారు మడుల్లో యాజమాన్యం ముఖ్యం



రైతులకు వివరిస్తున్న ఏఓ యుగంధరరెడ్డి

జరుగుమల్లి: మండలంలోని పైడిపాడు గ్రామంలో పొగాకు నారు మడులను వ్యవసాయాధికారి గురువారం పరిశీలించారు. సంప్రదాయ పద్ధతుల్లో పొగాకు నారు పెంపకం, యాజమాన్య పద్ధతులను రైతులకు వివరించారు.

- నారు మడుల పెంపకానికి ఎర్రగరప నేలలు లేదా ఇసుక నేలలు అనువుగా ఉంటాయి. ఒకసారి నారు మడి కట్టిన నేలపై వరి ఊక పరిచి కాల్చి శుద్ధి చేసుకోవాలి. తద్వారా నేల నుంచి సంక్రమించే వ్యాధులు, క్రిములు అలాగే కలుపు మెక్కల విత్తనాలు, వేరు కుళ్లు శిలీంద్రం నశిస్తాయి.
- విత్తుటకు కనీసం 20 రోజుల ముందు 10 చ.మీ మడికి 25 కిలోల పశువుల ఎరువు పైపొరల్లో బాగా కలిసేటట్లు వేయాలి. విత్తుటకు ముందు 10 చ.మీ మడికి 50 గ్రాముల పోటాషియం సల్ఫేట్, 300 గ్రాముల సూపర్ ఫాస్ఫేట్, 100 గ్రాముల డోలమైట్ వేయాలి.
- ఎర పంటగా ఆముదం లేదా బంతి మెక్కలను నారు మడి చుట్టూ నాటుకోవాలి.
- ఒక హెక్టారుకు 3.5 కిలోల విత్తనాలు సరిపోతాయి. అంతకంటే ఎక్కువైతే మాగుడు తెగులు సోకే ప్రమాదం ఉంది. నారుపై మాగుడు తెగులు సోకితే 20 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. జల్లెడ పురుగు సోకితే 5 గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. తెల్ల దోమ ఉంటే 2 మి.లీ ఇమిడాక్లోప్రిడ్ మందును 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు.

చవితి ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు



మోపాడులో పూజల్లో పాల్గొన్న రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు, నాయకులు



పామూరు అంకాళమ్మ వీధిలో పూజల్లో పాల్గొన్న హుసేన్‌రెడ్డి, నాయకులు

పామూరు: వినాయక చవితి ఉత్సవాల్లో గురువారం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, పలువురు పార్టీ నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. పామూరు సీఎస్‌పురంరోడ్డు, ఎర్రచేలు, కొత్తపల్లె, మోపాడు గ్రామాల్లో చింతలచెరువు సత్యనారాయరెడ్డి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యవర్గ సభ్యులు కల్లూరి రామిరెడ్డి, వైఎస్సార్ సీపీ యూత్ మండల అధ్యక్షుడు యాదాల సాయికిరణ్, కనిగిరి జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, వెలిగండ్ల జెడ్పీటీసీ గుంటక తిరుపతిరెడ్డి, హెచ్ఎంపాడు జెడ్పీటీసీ దద్దాల నారాయణయాదవ్, ముడియాల అనంత రెడ్డి, అంబటి కొండారెడ్డి, కేతు రమేష్‌రెడ్డి, యు.రమేష్ రెడ్డి, అంబవరపు లక్ష్మీనారాయణ, పుట్లూరి రవీంద్ర, సరాబు చంద్ర, మాజీ ఎంపీటీసీ చప్పిడి రామయ్య, కోటపాటి రవికుమార్‌రెడ్డి, సత్యంరెడ్డి, గోను చంద్ర శేఖర్‌రెడ్డి, నాగేశ్వరరావు పలువురు పాల్గొన్నారు. అంకాళమ్మ వీధిలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్, కాపుసంఘం నాయకులు రమణయ్య, గోవిందయ్య, గట్లా విజయబాస్కర్‌రెడ్డి పలువురు పాల్గొని వినాయక పూజలు నిర్వహించారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



సీసీ రోడ్డుకు భూమిపూజ చేస్తున్న నేతలు

సీఎస్‌పురం (పామూరు): సీసీరోడ్ల నిర్మాణంతో గ్రామాలకు మహర్దశ పట్టనుందని మండల వైఎస్సార్‌సీపీ నాయకుడు ముత్యాల నారాయణరెడ్డి, సర్పంచ్ ముత్యాల భారతిరెడ్డి అన్నారు. మండలంలోని అయ్యలూరివారిపల్లెలో గురువారం రూ.15 లక్షలతో నిర్మించనున్న సీసీరోడ్డుకు భూమిపూజ నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామాలఅభివృద్ధికి పట్టుకొమ్మలుగా భావించి గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యం ఇచ్చారన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో రూ.20 లక్షలతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారన్నారు. అర్హతే ప్రామాణికంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేస్తూ పేదలకు అండగా నిలిచారన్నారు. సచివాలయ వ్యవస్థ, వలంటీర్ల ఏర్పాటుతో పాలనను ప్రజలకు మరింత చేరువచేసి ధర్మపాలన అందిస్తున్నారన్నారు. గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు చేపట్టి గ్రామాలను సుందరంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్నామన్నారు. పోకల రమణయ్య, పెద్దిరెడ్డి చిన్న ఓబుల్‌రెడ్డి, గంటా తిరుమలరెడ్డి, యం.రమణారెడ్డి, జి.తిరుపతిరెడ్డి, పి.రామిరెడ్డి పలువురు గ్రామస్తులు, వైఎస్సాఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే తగిన గుర్తింపు



పున్నమ్మ దంపతులను సన్మానిస్తున్న వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, ఉపాధ్యాయులు, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): అంకితభావంతో పనిచేస్తే వృత్తిలో తగిన గుర్తింపు పొందుతారని వైస్ ఎంపీపీ దుగ్గిరెడ్డి ప్రతాప్‌రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పలపాడు ప్రభుత్వ ప్రాథమికోన్నతపాఠశాలలో గురువారం పాఠశాల హెచ్‌ఎం షేక్.నాయబ్‌రసూల్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాఠశాలలో పనిచేస్తూ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డు పొందిన ఉపాధ్యాయిని డి.పున్నమ్మ దంపతులను వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి, నాయకులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైందని ఉపాధ్యాయురాలిగా ఆమె పాఠశాల అభివృద్ధికి, విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు చేసిన కృషి ఎనలేనిదని జిల్లా అవార్డుపొందడం అభినందనీయమన్నారు. అదేవిధంగా హెచ్‌ఎం నాయబ్‌రసూల్, నాయకులు మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికోసం వైస్ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి తన సొంతని నిధులు రూ.30 వేలతో సౌండ్ బాక్స్, 10 కుర్చీలు పాఠశాలకు ఇవ్వడం కొనియాడదగినదని పేర్కొని వైస్ ఎంపీపీని ఘనంగా సన్మానించారు. సర్పంచ్ వై.ప్రవీణ్‌కుమార్, మల్లికార్జున రెడ్డి, కమ్మనేతి వెంకటేశ్వర్లు, రత్నారెడ్డి, బుడేసా, సిద్దు వెంకటరెడ్డి, జి.చినమాలకొండయ్య, సూర్యనారాయణరెడ్డి, శివారెడ్డి, జె.ఎస్.ఆనంద్‌బాబు, ఎం.రామయ్య, ఖాజారంతుల్లా, యల్.ఆంథోని, ఎలికా శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

సమస్యలపై తక్షణం స్పందించాలి



మాట్లాడుతున్న విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ

కనిగిరి రూరల్: వినియోగదారుల సమస్యలపై విద్యుత్ అధికారులు, సిబ్బంది తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యుత్ ఎస్ఈ కేవీజీ సత్యన్నారాయణ అన్నారు. స్థానిక బ్రహ్మణ కళ్యాణ మండపంలో గురువారం కనిగిరి డివిజన్ స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఈ సత్యన్నారాయణ మాట్లాడుతూ వినియోగదారులు చెప్పిన విద్యుత్ ఫిర్యాదులపై అలసత్వం వహిస్తే శాఖ పరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. విద్యుత్ బిల్లింగ్ నమోదులో నూరు శాతం ఆటోమెటిక్ స్కానింగ్ జర గాలన్నారు. అలాగైతేనే బిల్లింగ్ నమోదులో పొరపాట్లు, అవకతవకలు జరగవన్నారు. త్వరలో 200 యూనిట్లు దాటిన ప్రతి సర్వీసుకు స్మార్ట్ మీటర్‌ను బిగించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. తద్వార వినియోగదారులకు నాణ్యమైన మెరుగైన విద్యుత్ సరఫరా జరుగుతుందని చెప్పారు. ఈఈ ఎం నాగేశ్వర రావు, ఏడీఈ ఆర్ ఉమాకాంత్, ఏఈలు పవన్ కుమార్, సీహెచ్ రాజేష్, ఎల్ఎం వెంకటయ్య, జేఏల్ఎంలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో సకల సౌకర్యాలు



రికార్డులు తనిఖీ చేస్తున్న ఎంఈఓ బాలాజీ

జరుగుమల్లి(టంగుటూరు): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంస్కరణలతో పాఠశాలల రూపు రేఖలు మారిపోయాయని, సకల సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాయని ఎంఈఓ తన్నీరు బాలాజీ పేర్కొన్నారు. పాఠశాలలో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని ఉపాధ్యాయులకు సూచించారు. టంగుటూరు మండలం వెంకటాయపాలెంలోని ట్రైబల్ వెల్ఫేర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంఈఓ సందర్శించారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరుపట్టీలు, పాఠ్య ప్రణాళికలు, బోధనోపకరణాలు తనిఖీ చేశారు. ఉపాధ్యాయులు సమయ పాలన పాటించాలని సూచించారు.